క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

బాధితురాలికి పరామర్శ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండలంలోని వెంకటాపురం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎరుకలి దేవమ్మను శుక్రవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, రాములుయాదవ్, నాయకులు బునాదిపురం నరేందర్, శంకర్‌నాయుడు, రాజశేఖర్‌గౌడ్, దామోదర్‌గౌడ్, ఈశ్వరయ్య, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులుసాగర్ చిన్నంబావి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చిన్నంబావి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆర్ఐ రాములు గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

వాహన తనిఖీలు



ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. నగదుకు సంబంధించిన పూర్తిస్థాయి ధృవపత్రాలు ఉండాలని, ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఎన్నికల నియమావళిని పాటించాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని, తాగిన వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని వెంకటాపురం రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశంలో మద్యం తాగుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

వనపర్తి టౌన్: నిత్య జీవితం మొదలుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు గణితం అన్నింటికి మూలమని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో కనబరిచిన ప్రతిభకు గణిత పితామహుడిగా చరిత్రకెక్కాడని గుర్తుచేశారు. శ్రీనివాస రామానుజన్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, నాయకులు గంధం నాగరాజు, చంద్రశేఖర్ నాయక్, రాంబాబు, ఈశ్వర్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ టాపర్‌కు సన్మానం

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని 30 వార్డుకు చెందిన సుదర్శన్‌రెడ్డి, వనజ దంపతుల కుమార్తె శ్రీతేజ గురువారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ర్యాంక్ సాధించింది. దీంతో శుక్రవారం అఖిపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్, కాలనీవాసులతో కలసి శ్రీతేజను అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ స్కిల్క్‌ను బట్టి చదువులో ముందుకు వెళ్లాలని, మార్కులు తక్కువగా వచ్చాయని, ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పకుండా మనోధైర్యంతో చదువులో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాములు, శ్రీనివాసులు, విష్ణు, రామ్‌దేవారెడ్డి, భిక్షపతి, శివకుమార్, నరేష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్న.. ఓటేయాల్సిందే



పాన్‌గల్ ఉన్నత పాఠశాలలో ఓటరు సంకల్ప పత్రంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- ఓటింగ్ శాతం పెంచేందుకు విద్యార్థుల భాగస్వామ్యం
- పాఠశాలల్లో ఈసీ వినూత్న ప్రయోగం

పాన్‌గల్: లోక్‌సభ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎలాంటి ఎన్నికలైన ఓటు అత్యంత ప్రాముఖ్యం కలిగి ఉంటుంది. లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో ఓటర్లను చైతన్య పరిచే దిశగా ఎన్నికల కమిషన్ పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందు కోసం 'సంకల్ప పత్రాలు' పేరుతో ముద్రించిన కరపత్రాలను పాఠశాలల్లోని విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు అందజేసి ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నారు. 'ఎన్నికల పర్వం.. దేశానికి గర్వం' చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటు శీర్షికతో సంకల్ప పత్రాలను ముద్రించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు ఓటు వినియోగించుకునేలా ప్రతిజ్ఞ చేయిస్తున్నారు.

ప్రలోభాలకు గురి కావొద్దు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతన్న విద్యార్థులకు ఒక్కో పత్రాన్ని యాజమాన్యాలు ఇది వరకే పంపిణీ చేశాయి. తెలుగు, ఆంగ్ల భాషలో ముద్రించిన సంకల్ప పత్రాలను ఇంటికి తీసుకెళ్లి పిల్లలు తమ తల్లిదండ్రుల ముందు చదవాలని ఉపాధ్యాయ వర్గాల ద్వారా తెలియజేశారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటేయాలనే సందేశాన్ని సంబంధిత పత్రంలో పేర్కొన్నారు.



చిక్కేపల్లి ఉన్నత పాఠశాలలో..

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

పోలింగ్ రోజు ఓటర్లంతా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చేలా సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఊరూవాడలా ఓటు ప్రాముఖ్యంపై స్వీప్‌పై (సిస్టమెటిక్ ఓటరు ఎడ్యుకేషన్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) అధికారులు చైతన్యం చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మొబైల్ వాహనాలు, గోడ పత్రాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్ ద్వారా ఓటు విలువ, పోలింగ్ సమాచారం, ఇతర వివరాలను కళాబృందాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రతి ఓటరుకు అవగాహన

ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా తల్లిదండ్రులకు తెలియజేసేలా విద్యార్థులకు అవగాహన కల్పించాం. డబ్బుకు, మద్యానికి ఓటును అమ్ముకోకుండా నిర్భయంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించాం.

– లక్ష్మీనారాయణ, హెచ్ఎం, హైస్కూల్, చిక్కేపల్లి.

సంకల్ప పత్రంపై..



వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో భయం, పక్షపాతం లేకుండా ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేసేలా మా తల్లిదండ్రులకు వివరించాం. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని భవిష్యత్‌కు భరోసా కల్పించే వారికే ఓటు వేయాలి.

– పల్లవి, 9వ తరగతి, హైస్కూల్, పాన్‌గల్

విద్యార్థులతో అవగాహన..



ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా విద్యార్థులచే వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. దీంతో ఓటింగ్ శాతం పెరుగుతుంది. గ్రామాల్లో బీఎల్ఓలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా ఓటు వినియోగంపై విస్తృతంగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– సుభాష్‌నాయుడు, తహసీల్దార్, పాన్‌గల్

మండలాల వారీగా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
పాన్‌గల్	14	1,535	44	41,469
చిన్నంబావి	13	945	31	24,821
వీపనగండ్ల	11	988	28	23,279



మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మస్తీపురంలో చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి కాకుండా వాటి పాదుల వద్ద చెత్తచెదారం తొలగించాలని సూచించారు. మొక్కలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిచాలని ఆదేశించారు. ప్రార్థన మందిరాలు, ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణంలో నాటిక మొక్కలు ఎండుముఖం పట్టకుండా వాటిని కాపాడాల్సిన అవసరం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

కొనసాగుతున్న మునిరంగస్వామి జాతర

అమరచింత: మండలంలోని నందిమళ్లలో వెలసిన చింతల మునిరంగస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాల ప్రజలే కాకుండా సరిహద్దు జిల్లాల భక్తులతో పాటు రాయిచూర్ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయంలో కొలువుదీరిన స్వామివారికి పోటేళ్లను బలిచ్చి పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకుంటున్నారు. గురువారం అర్ధరాత్ర స్వామివారి ప్రభోత్సవ కార్యక్రమం కనులపండువగా కొనసాగింది. టీపీసీసీ కల్లుగీత కార్మిక డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ ఆలయంలో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు.



మోసపూరిత హామీలతో అందలం



ఖిల్లాఘనపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ నందిమల్ల అశోక్, జెడ్పీటీసీ సామ్యానాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం రుక్కన్నపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. అధికారం కోసం కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఇన్నాళ్లు హామీల గురించి మాట్లాడని సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకాలకు తెర తీశారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ విద్యావంతుడు అయిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుతో మేలు

ఆత్మకూర్: గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పడం వల్ల అందరికీ మేలు జరుగుతుందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, జెడ్పీచైర్మన్లు స్వర్ణమ్మ, లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి ఆగ్రోటెక్ ఇండస్ట్రీని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆత్మకూర్‌లో ఇండస్ట్రీని నెలకొల్పిన నిర్వాహకులు పులిమామిడి రమేష్‌శెట్టి, సుధారాణి దంపతులను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, రాజేష్, జోష్న, శ్రీలక్ష్మి, యక్షిత్‌రాజ్, నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, నల్గొండ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

తాగునీటి పైప్‌లైన్ లీకేజీ

అమరచింత: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా ఏడు గ్రామాలకు తాగునీటి ఎద్దడి నెలకొంది. శుక్రవారం మస్తీపురం ఎక్స్‌రోడ్ సమీపంలో మిషన్ భగీరథ నీటికి సంబంధించిన పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో ఆత్మకూర్, అమరచింత, సింగపేట, మస్తీపురం, ఖనాపురం, పాంరెడ్డిపల్లి, కొంకన్‌వానిపల్లి గ్రామాలకు తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మరమ్మతు కోసం మిషన్ భగీరథ అధికారులు శుక్రవారం రాత్రి యత్నించిన ఫలితం లేకపోవడంతో శనివారం సైతం ఆయా గ్రామాలకు తాగునీటి ఎద్దడి తప్పదంటున్నారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ట్యాంకర్ల ద్వారా ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిసింది. అసలే వేసవి కాలం ఆపై తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో మరింత నీటి కష్టాలు తెచ్చిపెట్టింది. అధికారులు స్పందించి త్వరితంగా పైప్‌లైన్ లీకేజీని మరమ్మతు చేసి తాగు నీటి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వద్దు

పాన్‌గల్: వైద్య సేవల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సరైన సమయంలో వైద్యం అందించాలని అసంక్రమిత వ్యాధుల జిల్లా కన్సల్టెంట్ ఊహశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రతి గ్రామంలో అసంక్రమిత వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి వైద్య సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. డయాబెటిస్, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులపై వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు ఆమె జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసులుతో కలిసి శిక్షణ ఇచ్చారు. సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వం నుంచి అందుతున్న వైద్య సేవలపై ప్రజలను చైతన్యం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



పెబ్బేరు రూరల్: మండలంలోని అయ్యావారిపల్లి ఆలయంలో శుక్రవారం సీతారాముల విగ్రహ పతిష్ఠాపన, ధ్వజస్తంభ, నవగ్రహాలు, బొడ్రాయి పున:ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో యజ్ఞ యాగాలతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు.

శ్రీరంగాపురం మండలంలో..

నాగరాలలోని మొదటి సెంటర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ పతిష్ఠాపన, ధ్వజస్తంభ, నవగ్రహాలు, బొడ్రాళ్ల పున:ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

వర్గీకరణ సాధన సదస్సులో పాల్గొనండి

వీపనగండ్ల: ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు శనివారం ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర యూనివర్సిటీ మాదిగ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొల్కపల్లి పరశురాముడు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం నరేంద్రమోదీ హామీ ఇచ్చారని, హామీని నేరవేర్చేందుకు అవసరమైన ఉద్యమాలను రూపొందించాల్సి ఉందని చెప్పారన్నారు. గతంలో హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభలకు వచ్చిన సందర్భంగా మాదిగలకు అండగా ఉంటానని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారని గుర్తుచేశా. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు దెయ్యపు కృష్ణ, బండారు విష్ణు, శ్రీరాం, సంజీవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరశురాముడు

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న తిరుపతమ్మ, కృష్ణయ్యగౌడ్ దంపతులు



మదనాపురంలో..

మదనాపురం: మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామకృష్ణ, మహాదేవన్‌గౌడ్, బక్షి హనుమాన్ రావు, మండల ఉపాధ్యక్షుడు వడ్డె కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌నారాయణ, మాజీ సర్పంచ్ వేమన్న, టీసీ నాగన్నయాదవ్, రవీందర్‌రెడ్డి, నాగరాజుగౌడ్, రావూఫ్, కోటేశ్వర్, లియాఖత్, మనివర్ధన్, అర్జున్, మన్నెం తదితరులు పాల్గొన్నారు.

తిరిగి కాంగ్రెస్‌లో చేరిక

వీపనగండ్ల: రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికలకు ముందు కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి బీసీ కోటాలో టికెట్ ఆశించి భంగపడ్డ కాంగ్రెస్ రాష్ట్ర మహిళా కార్యదర్శి కాటమోని తిరుపతమ్మ బీఆర్ఎస్‌లో చేరగా.. తిరిగి శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె భర్త కొల్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏఐసీసీ చేరికల కమిటీ సభ్యుడు జగ్గారెడ్డి, జాతీయ కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి వీరికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తిరిగి సొంత గూటికి చేరుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తిరుతమ్మ దంపతులు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో జాప్యం తగదు

పాన్‌గల్: జాప్యం చేయకుండా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని కాంటా చేయాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా నేటికీ ధాన్యం కాంటా చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని, లేనిచో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కుర్మయ్య, రాములు, బీరయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి ఎదగాలి

ఆత్మకూర్: విద్యార్థులు చదువుల్లో రాణించి దేశం గర్వించేస్థాయికి ఎదగాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూర్‌కు చెందిన విద్యార్థులు వాకిటి కుమార్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నాల్గో ర్యాంకు సాధించాడు. అలాగే బైపీసీ విభాగంలో గడ్డమీది సాయిచరణ్ 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో నాల్గో ర్యాంకు సాధించాడు. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్యే విద్యార్థులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్రగీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, పరమేష్, నల్గొండశ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యం

కొత్తకోట రూరల్: దేశంలోని పేదల సంక్షేమమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని, గడిచిన పదేళ్లలో ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూసే విధంగా అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని వడ్డెవాట, చర్లపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. చర్లపల్లి శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కొన్నేళ్లుగా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 5కిలోల చొప్పున రేషన్ బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నారని, రైతులకు సబ్సిడీతో ఎరువులు ఇస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ భరత్‌భూషణ్, కోటేశ్వర్‌రెడ్డి, బాలస్వామి, వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి దేశాభివృద్ధికి తోడ్పాటునివ్వాలని బీజేపీ పుర ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పిన్నంచర్లలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారతదేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, ఈసారి ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించడమే లక్ష్యమని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ఆంజనేయులు, సురేష్, మహేందర్‌రెడ్డి, నీలారెడ్డి, నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



చర్లపల్లిలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ముస్లింలపై మతపరమైన వ్యాఖ్యలు తగవు

అమరచింత: ముస్లింలపై మతపరమైన అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రధాని మోదీపై అనర్హత వేటు వేయాలంటూ శుక్రవారం పట్టణంలో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్, పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రధాని మోదీపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ చాంద్‌పాషా, ఎస్ఐ సురేష్ కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా నాయకులు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ ఏప్రిల్ 21 ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ వస్తే ప్రజల సంపదను ముస్లింలకు పంచుతుందని, అలాగే మహిళల మంగళసూత్రాలు, ఆస్తులు కూడా వదలరని, జప్తు చేసుకుంటారని ప్రసంగించడం ముస్లిం మనోభావాలను కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. దేశానికి ప్రధానిగా ఉన్న మోదీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి హిందూ, ముస్లింలను విభజించి ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. భారత ఎన్నికల నియమ నిబంధనలను అతిక్రమించినందుకు సెక్షన్ 23 ప్రకారం ఆరేళ్ల పాటు నరేంద్రమోదీని ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో తౌఫిక్, అలీషేక్, పాషా, నసీర్, నబీ, ఆశు, షంషీర్, కరీం, నిస్సార్, కుతుబ్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు



కిందకు వేలాడుతున్న కరెంటు వైర్లు

గోపాల్‌పేట: మండల కేంద్రానికి సమీపంలోని అమ్మచెరువు సమీప ప్రాంతాల్లో కరెంటు వైర్లు కిందకు వేలాడుతున్నాయి. వైర్లు తగిలి ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనని స్థానిక రైతులు, ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.